# జ్యోతిర్మయి

### శ్రీ పొత్తపి సుధేష్ణగారు.

అవును. ఆ మూర్ఖపువెధవ దామోదరానికి తగినశిక్షే ప్రాప్తించింది. యౌవనగర్వం కాకపోతే మరేమి?—ఏగాలి కాతెర నెత్తక, బీదవాళ్ల నుద్ధరించాలట-వర్గభేదాలు నిర్మూలించాలట-ధనికవాదాన్ని దగ్ధంచేసి, దాని స్థానమున 'కష్టేఫలే' అనువాదం వ్యాపింప చేయాలట-అప్పుడేనట మన చదువు సార్థకం పొందేది...ఆ, ఏడ్చాడు! నే నెంతో చెప్పిచూచాను "నీకీ రాజకీయాలలో జోక్యంవద్దు. ఇంటిదగ్గర సేద్యంచూచుకోరా" అని. మిత్రునిమాట వినని ఫలితం ఈ నాడైనా బందిఖానాలో గుర్తించియుంటాడు దాము. శిక్ష తప్పించాలని నేను ఎంత ప్రయత్నించినా సాగలేదు. "పబ్లిక్ ప్రాసిక్యూటరుని—కాబట్టి ప్రభుత్వం చర్యలు అసంబద్ధంగా కనుపించినా, సమర్థించవలసిన బాధ్యతనాది—అని ఒక క్షణం-మరుసటి క్షణం—"నేనుకూడా కమ్యూనిష్టునేమో! అందరు తమ హృదయాలలో సామ్యవాదులే-కాని దాన్ని బహిరంగంగా చెప్పడానికి వలసిన గుండెధైర్యం అందరిలో యుండదు"—అని ఆలోచించాను.

నేను, దామోదరం కళాశాలలో సహాధ్యాయులము. నేను చట్ట పరీక్షలలో ఉత్తీర్ణుడనై న్యాయశాఖలో ప్రవేశించాను-అతడు దేశసేవకు డయినాడు.

మా ఇల్లు, మా గ్రామమైన పెంటపాడులో రాజభవనం. మాకు అంత గొప్ప భవనాలే ఆ ఊర్లో నాలుగైదున్నాయి. చెరకుపల్లెవారు ఆ పరిసర గ్రామాలలో దాతృత్వానికి ఖ్యాతి చెందిన రెడ్లవంశము.

దసరా పండుగకు కోర్టునకు సెలవగుటచేత పెంటపాడు వెళ్లాను. మామేడపైనుంచి తిలకింపదగిన ప్రకృతిశోభను, కాళిదాసు, పోతనవంటి మహానుభావులే అనుభవించి ఉద్ఘోషింప గలరని భావిస్తాను. ఇంట్లో నా నివాసం మేడ. కాఫీతో సహా అచ్చటికి రవాణా కావలసినదే.

అది సంధ్యాసమయము. నక్షత్రాలకు గగనంలో పందెములు జరిగాయేమో. విజయాన్ని పొంది గమ్యస్థానాన్ని చేరగలిగినకొద్ది తారామణులు మాత్రం గోచరిస్తున్నాయి. ఉదయాన వనపంచను వదలి వెళ్లిన పిట్టలను ఆహ్వానించడానికి, వృక్షాలు నృత్యగానాలలో మునిగి యున్నాయి. (ఇంకా ఎంతో గొప్పగా వర్ణించవచ్చు-నాకూ, కవితకు చాలా దూరము సుమండీ!) నేను ప్రేక్షకుడను మాత్రమే. చూచిన దృశ్యాన్నిగురించి ప్రశ్నలొస్తే, జవాబివ్వడానికి మాటలురావు. డాబామీద తిరుగుతూ, చుట్టుపట్లనున్న చెట్లు, పక్షులు, పువ్వులు, ఆకాశం, మార్పుచెందినాయేమోనని గమనిస్తే, అంతా తారుమారే. మొగ్గ తొడిగియుండిన చెట్లు పుష్పించాయి. పుష్పించియుండిన చెట్లు ఫలించాయి.

ఈవిధంగా పచారుచేస్తూ నేనాలోచించిన విషయాలేమీ లేవు. ప్రకృతి సౌందర్యోపాసకుడనయినాను. ఇట్టిపరిస్థితిలో మా రంగయ్య బండి ఇరుసుల 'కిఱ్ఱు', 'కిఱ్ఱు' శబ్దము నా చెవులలో పడినది. ఆ ఒంటెద్దుబండి మా మేడముందు క్షణకాలమాగినట్టుంది—మరుక్షణమే ముందుకు సాగింది. నాన్నగారి కోసరం ఎవరైన వచ్చి వెళ్తున్నారేమో అని-దాన్నిగుఱించి మరి ఆలోచించడం విరమించాను.

బండి నే నూహించినట్లు వీధిమలుపుతిరుగలేదు. (డాబానుంచి మా వీధి, మొదటినుంచి చివరదాక అగుపిస్తుంది.) ఇంతకూ, నాకు మొదటిలో ఏదో వంగపూరంగు అంచు కనిపించితే, బండిలోనున్న వ్యక్తి స్త్రీయేనని సులభంగా తేల్చగలిగాను. మా ఊర్లో బండిరావడమేకదా వింత. అందువల్ల వీధినున్న పిల్లలందరు బండిచుట్టుమూగి, అందలి వ్యక్తిని తేరపారి చూచారు. కొద్దిగ చీరరంగు అగుపించింది. "నీలిరంగు-బ్లూబెల్ పూరంగు-అవును-తెలిసింది-నా ముద్దురంగు-వంగపూరంగు, బ్లూబెల్ పూరంగు ఎవరి అత్యంత ప్రియమైన వర్ణములో-ఆమెకు ఈ రంగులంటే ప్రాణంకదూ?"—నా ఊహాలహరి, బండి వీధికొననుంచి వెనుకకు మరలి మావీధి మరల ప్రవేశించిన చప్పుడుచే చెదిరిపోయింది.

ఈ పర్యాయము, బండిలోని వ్యక్తి వెంట్రుకలు జీడి

గింజలాగ నల్లగ ఉన్నాయనీ, జడ త్రాచులాగ పొడుగుగ నున్నదని గ్రహించాను ..సందేహములేదు...ఆ వెంట్రుకలు, ఆ చీర ఆమెవే...కానీ వ్యక్తిని పోలిన వ్యక్తులెందరుండడము లేదు ?—అంతేకాక-ఆమె ఈ పల్లెటూరికెందుకొస్తుంది-బంధువులుకూడ లేరాయె-రైలుస్టేషన్ కాదు-మోటార్లుపోయే మార్గంలోనులేదు..." ఈలాగ నా ఊహలు ఎన్నోదిక్కులకు పోయినవి.

బండి మళ్లీ మా ఇంటిముందాగింది. మా ఇంటికే చుట్టాలెవరో వచ్చియుంటారని ధృఢీకరించాను. మేడ దిగవలెనంటే స్వాభావికముగ నాకు చాల బద్ధకము. నా సందేహానివృత్తి కోసరం, తిన్నగదిగి, అనేక గుమ్మాలుదాటి అవతలనున్న వరండా ప్రవేశించి చూచిన దృశ్యము కలయా అనిపించింది.

నా జ్యోతిర్మయియే ఆమె-నిస్సందేహంగా నే-అదేనవ్వు అవే చూడ్కులు-ఆమెపట్ల కాలఘాతం తన ఔద్ధత్యాన్ని ప్రదర్శింపలేక పోయింది. తలవని తలంపుగ మా ఇంటికే తెంచింది. అట్టి నా జ్యోతి కేలాగ స్వాగత మివ్వాలి-ఆమె పట్ల నేను చాలాఅన్యాయ మాచరించాను. (అది ఒకరామాయణ మవుతుంది-ఇంకొక పర్యాయము సావకాశముగ విన్నవిస్తాను.)

నానోట మాటవెలువడలేదంటే మీరునమ్మాలి. వరండా కంబమును ఆనుకొని నిల్చున్నాను. నా వకీలు వాచాలత, సమయస్ఫూర్థి అప్పుడు మాయమైనాయి. ఆమెకు సామానేమీ ఉన్నట్లు కనుపించలేదు.

కడపటు—"జ్యోతీ!"...అనిమాత్రం నా నోటినుంచి వెలువడింది. అప్పుడే అయస్కాంతమువలె ఆమె కంఠ మందలి నల్లపూసలపేరు నా నేత్రాలను ఆకర్షించింది. నా అనుమానమును ఈ సంఘటన మరింత బలపరిచింది—జ్యోతి నా మాటపాటించి పెళ్లిచేసు కొన్నదికదా అను విషయము-మరొకవైపు నిస్పృహా అదేష్ఠలాన్ని ముట్టడించింది.

"జ్యోతీ"— అని పిలవగనే ఆమె ముఖములోని వికాసం ఇనుమడించింది—"నేనే"నంటూ ఆమె విస్ఫారిత నయనాలతో బదులు పలికింది.

"ఎక్కడనుంచి రాక ? ఎప్పుడొచ్చావు ? మా ఇంట్లో ఉంటావా ?..." మొదలగు ప్రశ్న పరంపరలచే ఆమె మనస్సును నింపాలనిపించింది—ఎంత ప్రయత్నించినా, వాక్కులు నోట్లోనే అంతరించేవి. వివాహమైనదని ఎఱిగినంతనే, 'నీవు' అని సంబోధించాలా, 'మీరు' అనవలెనా- అన్న మీమాంస తేల్చడానికి కొన్ని క్షణాలుపట్టింది.

ఇంతలోపుగ బండివాడికి కిరాయిచ్చి పంపేసివచ్చి తన స్థానంలో-వీధి అరుగు ఆనుకొని నిలబడింది జ్యోతి.

"లోపల నాగదికిపోదామురండి"-అని తడబడేమాటల్తో వణికే కంఠంతో, కంపిత హృదయముతో, గద్గదస్వరముతో పలికాను.

"నే నేనాటికి 'నీవు' కానీ 'మీరు' కాదండీ— అని ఆమె నవ్వుతు జవాబిచ్చింది. మునుపటికంటె మనిషి సన్నగించి నట్లగుపించింది.

మేడపైకి దారితీసాను. నౌకర్లందరు తలొక పనిలో నిమగ్నులైనందువలననో-మరెందుచేతనో, ఆమె రాకని గమనించినట్లు కనుపించదు. వీధిలో మూగినట్లు, మా ఇంట్లో ఎవరికి ఆమె అడుగుల సవ్వడియైన తెలిసినట్లులేదు. ఆమె నా వెనకాలే వచ్చింది. మెట్లు ఎక్కుతున్నంతసేపు ఏమని పలుకరించడానికి పాలుపోలేదు.

నాగది ప్రవేశించాము. ఒకకుర్చీలో ఆమెను కూర్చుండ నియమించి, మరొకదానిని ఆమె కెదురుగ లాగి, నేనందులో కూర్చున్నాను. అనిర్వచనీయమైన, దురవగాహమైన బాధనా హృదయాన్ని కలతపెట్టింది. ఇదివరకు గంటలతరబడి మాట్లాడుచుండిన నేను, ఆమెను గుఱించిన మధుర భావాలతో మనశ్శాంతి పొందుచుండిన నేను, ఈ రాత్రి ఎదుట కూర్చుని ఆమె కళ్లలోకి నిర్దోష చూడ్కులతో పరికించాలంటే జంకు కలిగింది. ఆమెతో సంభాషించడమే, ఆ రోజులలో మహాపుణ్యంగ భావించేవాణ్ణి. ఆమె సమీపంలో నున్నంతసేపు తన్మయత్వము పొందేవాణ్ణి. ఈనాడు ఆనంద తెమ్మెరలు మాటు మణిగాయి.

నా ప్రకనున్న రౌండుటేబిల్ మీద, 'ఉమర్ ఖయాం' పద్యసంపుటము, 'ఏకాంతసేవ'- కొన్ని వార్తాపత్రికలు పడి

యున్నాయి. ( మా గ్రామములో గ్రంథలోకమే నా సన్నిహితులు)

ప్రణయమా! నీవు నేనును విధితో గలిసి,
సృష్టివిధానము నెల్ల వశముగాంచ .....

అను పద్యం గోచరించింది. ఒకప్పుడు జ్యోతీ నేను ఆ విధంగ తలపోసిన వాళ్లమే. విధి మమ్మల్ని వేరు చేసింది. మా ఆశాభవనం పునాదితో సహా నేలవాలింది.

"ఎన్నాళ్లయింది జ్యోతీ నిన్ను చూచి-ఈ విధంగా మా గ్రామాని కొచ్చావెందుకు?—నా హృదయం గడచిన నాలుగేళ్ల నీ ఇతిహాసాన్ని వినడానికి ఆత్రపడుతున్నది-" అన్నాను గ్రంథంలో మరొక పుటను తిరగవేస్తూ.

నా మచ్చిక హోరి పిచ్చుక, గదిలో నూతన వ్యక్తిని గాంచి తుఱ్ఱున ఎదుటి కిటికీగుండ పారిపోయి, సమీపములో దేవగన్నేరు చెట్టుకొమ్మపై కూర్చుని నన్ను పిలువసాగింది.

"అవును—నాలుగు దీర్ఘ సంవత్సరములు గడిచాయి. మీలో ఎంతో మార్పు కలిగినట్టున్నదండీ,"—అని జ్యోతి జవాబు.

"లేదు. నేను పాతకాలము వాడినేనుమా-బాగా పరికించు"—అన్నాను ఏమి బదులివ్వడానికి తోచక.

మరు నిమిషమే "నీవు వస్తున్నట్లు ఉత్తరమైన వ్రాయలేదేమి జ్యోతీ"—నా కుర్చీని మరికొంచము సమీపానికి లాగుతో ప్రశ్నించాను.

నే ననుకొనిన బదులే వచ్చింది జ్యోతి నోటి వెంబడి—"మీ రిక్కడే ఉంటారని కలగన్నానా? లేక మీ బాగోగులను గురించి నాకేమన్నా తెలిపారా?"—ఇది నా తప్పే అవమానముతో తల వంచాను.

తరువాత ఐదునిమిషాలు మాలో ఎవరు మాట్లాడ సాహసింపలేదు. జ్యోతి కిటికీలోనుంచి వెలుపలి నిశ్చల గగనములోనికి చూస్తూ, తారకలతో నిస్తబ్ధహృదయంతో సంభాషిస్తున్నది.

జ్యోతీ ఎవరు-ఆమెకు నాకుగల సంబంధమెట్టిదని—మీమనసులలో ఒక సవాలు కలుగవచ్చు. క్లుప్తంగా ఆమె చరిత్ర చెప్తాను.

జ్యోతి—పూర్తి నామధేయం, జ్యోతిర్మయి. కళాశాలలో మొదటి పర్యాయము పేరు విన్నంతనే, ఆ పేరు గల వ్యక్తితో పరిచయము కలుగ చేసుకోవాలనిపించింది. కానీ నే నందరి విద్యార్థుల లాగ కూరుణ్ణి కానందు వలన—ఈ అవకాశము కోసరము రెండు సంవత్సరాలు వేచియున్నాను. (అంతా నగ్న సత్యం సుమండీ!)—ఏలాగో మా ఇరువురిమధ్య క్రమంగా సుహృద్భావ మేర్పడింది. ఒక ఏడాది గడిచే టప్పటికి, నేను ఏదో అపవాదాలను జ్యోతిర్మయిపై మోపి-ఆమె సున్నిత హృదయాన్ని గాయపరచాను. రక్తచారలు నేటికిని మాయలేదనుకుంటా. (గతించిన దానికి ఇప్పటికిని వితర్కిస్తున్నాను-పశ్చాత్తాప పడుచున్నాను.) మా ప్రణయ నౌకను చేతులారా జలధిని ముంచి, సురక్షితంగా నేనుమాత్రం గట్టెక్కినానని సంతోషించినాను. కొద్దిరోజులు మాత్రమే ఉన్నదీ ఆనందం. (ఇంత సులభముగ జ్యోతి ప్రేమ బంధాలనుంచి విముక్తి పొందానన్నది.) ప్రపంచములో వస్తువ విలువ దానిని గోల్పోయినప్పుడు గానీ, స్పష్టంగా తెలియదు. జోతిర్మయికి క్షమాపణ వేడుతు ఉత్తరాన్ని వ్రాస్తామనుకొన్నాను. కానీ ఆమె పోకడ తెలియలేదు. ఆమెని కలసికోవాలన్న ఉబలాటం రోజుకు రోజుకు ఎక్కువగుచుండెను. జీవితములో నే నెఱిగిన స్త్రీ ఆమె ఒక్కతే—'జ్యోతి' సార్థక నామధేయ-నా జీవనజ్యోతి-మరల ఈ రాత్రి నా గృహములో సహజదీప్తితో ప్రకాశించడాని కేతెంచినది.

ఇంత సేపటికి బయట వీధులలో మినుకు మినుకు మంటున్న దీపాలు వెలిగింపబడినాయి. నౌకరొకడు నా గదిలో దీపాన్ని పెట్టి, జ్యోతిర్మయిని చూచి, ఏమో ఆలోచిస్తూ దిగిపోయాడు. చాల చీకటిపడింది. దీన్ని నౌకరు దీపం తెచ్చేంతవరకు గుర్తించలేదు. (నా జ్యోతి యుండెకదా—గదినికాదు, భవనాన్ని కాదు- నా జీవిత ధాత్రినే జ్వలింప చేయడానికి)

"జ్యోతీ, నీకుపెళ్లిఅయి ఎన్నాళ్లయింది. ఆహ్వానమైనా లేదే"—అని అడిగాను. ఈప్రశ్న వేయడానికి నాకుగల అర్హతను తర్కింప ప్రారంభించాను. ఆమె ప్రసాదించిన

ప్రేమరసాన్ని-కలికతోసహా విసిరివేసిన పిదప నాకు ఆర్ద్రత ఎక్కడిది ?

"ఏదో ఆ తంతూ ముగిసింది. మా తలిదండ్రులు ధన్యులైనారు. అప్పుడే ఏడాదయింది."-ఇంతవరకు గంభీరముద్ర దాల్చిన జ్యోతి వదనములో విషాదరేఖలు కనిపించాయనుకున్నాను. ఒకటి రెండు జల బిందువులు మృదువైన చెక్కిళ్లనుంచి జారి-అప్రయత్నముగ-చేతులలో యుండిన "ఆంధ్రపత్రిక"పై పడినాయి. వాటిని నిరోధించడానికి జ్యోతి బ్రహ్మప్రయత్నముచేసి విఫలమైనట్టు కనుపించింది.

ఒకనిమిషమాగి మరల ప్రారంభించింది.

"మీ జ్యోతికికాదు అయినది పెళ్లి—జ్యోతిర్మయికి—పెళ్లైన పిదప నాకు శాంతిలభించిందా-అనేది మీ తరువాతి ప్రశ్న కావచ్చు. ప్రేమకు, పెళ్లికి వున్న తేడా మీకు తెలిసినదే. అలాంటిదే నా పెళ్లి"—పైటచెంగుతో చెక్కిళ్లు తుడుచుకొనెను.

"నా భర్త పేరు-కేశవచంద్రుడు. ఢాకాలో పట్టుబట్టల వ్యాపారము చేస్తున్నారు. నేనంటే అమిత విశ్వాసమాయనకు-కానీ నేనెంత ప్రయత్నించినా, మన మానసిక వలపును విస్మరింప లేకున్నాను."

వంటవాడు వెంకయ్య—"పెద్దయ్యగారు మిమ్మల్ని భోజనానికి రమ్మంటున్నారు, రామయ్యా"—అని వార్త తెచ్చాడు. చేతిగడియారముచూస్తే ఏడున్నర అయినది. మా నాన్నగారికి, ప్రొద్దుగ్రుంకగనే భోంచేసి, తరువాత ఇతర పనులు చూచుకోవడము అలవాటు. నేను ఇంట్లో వున్నట్టయితే, నేను పంక్తిలో లేకుండ అన్నంతినరు. నాకూ అలాగేఉండేది. జ్యోతి సమీపంలో ఉంటే ఆకలేలేదు. ఈ రాత్రి అన్నంపై ధ్యాసేలేదు.

"జ్యోతీ, భోంచేస్తావా ?" అని అడిగాను.

జ్యోతికి నేను చాలా ఋణపడి యున్నాను. అంటే-ఆమె దగ్గరనుంచి ఎన్నో వస్తువులను పుచ్చుకున్నాను. ఆమె మాత్రం చిల్లిగవ్వకూడ అంగీకరించలేదు. ఈ పుచ్చుకోవడాలు అనవసర బాధ్యతలు కల్పిస్తాయని ఆమె భావన.

"మీ ఇంట్లో భోంచేయడానికి రాలేదండీ నేను—మా ఊరు పోతూ (అమ్మా నాన్నని చూడడానికి) ఢాకా వెళ్లి పోతే జీవితములో మరియొక పర్యాయము మిమ్మల్ని చూడ తటస్థించుట అసంభవమేమోనన్న భయం నా హృదయాన్ని అనేక దినాలుగా వ్యాకుల పెడ్తున్నది. మొదట్లో ఒంటరిగ వస్తున్నానే అని జడిసాను. కానీ అదృష్టవశాత్తు మిమ్మల్ని కలిసికొన్నాను. అంతేచాలు."

ఇక భరింపలేక టేబిల్‌పై తలపెట్టి వెక్కి వెక్కి ఏడ్వ ప్రారంభించింది. ఆమె మాటలు నాకు అంకుశ పోట్లలాగున్నాయి.

"జ్యోతీ—జ్యోతీ—ఏడ్వకు నిన్ను సంతోష పరచడానికి ఏంచేయమనినా సిద్ధుడనే"—అంటూ ఆమె తల నిమిరి కూర్చోబెట్టాను. (నేను జ్యోతి శరీరాన్ని స్పృశించడం ఇదే మొదటిదఫా—మాది నిష్కళంక, నిర్వికార, నిర్విశేష ప్రేమ.)

ఆమె నవ్వింది-స్వచ్ఛంధ దరహాసం కాదది-హేళనతో మిళితమైనది—"ఇంతదాక మీరు చూపిన దయయేచాలు, మరెట్టి సహాయము చేయనవసరము లేదు"—అని జవాబిచ్చింది. ఈ మాటలు దుర్భరంగా యుండినవి. కప్పను మ్రింగిన పామువలె మాట్లాడక జ్యోతి ముఖంవైపే చూస్తూ కూర్చున్నాను.

"ఇక వెళ్తానండీ రామనాథంగారు"—(మొదటిసారి ఆమె నన్ను పేరుపెట్టి పిలవడము) అంటూ లేవబోయింది.

"ఈ రాత్రి మా ఇంట్లోనే ఉండరాదా"—అని ప్రశ్నించాను.

"అంత ప్రయాస మీకివ్వడం నాకిష్టములేదు. సత్రంలో నా పెట్టె ఉన్నది. రాత్రి కక్కడ విశ్రమించి, రేపుదయాన్నే బయలు దేర్తాను."

"అయితే మా ఇంట్లో ఏమీ తినవన్నమాట"—అని కటువుగ ప్రశ్నించాను.

"రామనాథంగారూ మన్నించండి. మీరు ఇష్టపడి యున్నట్లయితే-ఒకానొక కాలములో ఈగృహములో నాకు అన్నమేకాదు, సర్వాధికారములు లభించియుండేవి .. ఈనాడిచ్చుట నాకట్టి హక్కులులేవు—మీ సౌఖ్యానందాలను

నేనునిరంతరము కోరుచుంటానని నమ్మండి-అంతేచాలు..."

జ్యోతి ఇక మాట్లాడ లేకపోయింది. దీపపు వెలుగులో, ఆమె నేత్రాలు ఎఱ్ఱబారి యుండడము గమనించాను.

"రామనాథ్—ఎన్నిసార్లురా నిన్ను పిల్చేది భోజనానికి ప్రొద్దుకాలేదా?" అంటూ నాన్న గదిగుమ్మందాటి లోన ప్రవేశింప బోయారు. జ్యోతినిచూచి రెండడుగులు వెనుకకు తగ్గారు.

"నాన్నారండి, ఈమెను మీకు తెలియ పరుస్తా" నని ఆయన కుడిచేతినిపట్టి లాగుకొచ్చాను. (మానాన్న దగ్గర నాకున్నంత చనువు మరెవరికి లేదు మా ఇంట్లో)—"ఈమె కాలేజీలో నాసహాధ్యాయిని నాన్నా. పేరు జ్యోతిర్మయి"

నాన్న గది ప్రవేశించడంచూచి, జ్యోతి లేచి అతనికి నమస్కరించింది

అప్పుడు మానాన్న ముఖములో అమితానందము తాండవించింది-ఎందు కంటారేమో-జ్యోతిని నిరాకరించి నప్పటి నుంచి, నేను జన్మాంతం వరకు బ్రహ్మచారిగ నుంటానని శపథం పుచ్చుకున్నాను. వచ్చిన సంబంధాలు వెనుకకు మరలినాయి. జ్యోతి మా ఇంట్లో ఉండడంచూసి, ఆయన ఈమె నాభావి అర్ధాంగి అని ఊహించి ఉంటారు. అతని అపోహాల పోగొట్టడానికి—"నాన్నా, జ్యోతిర్మయి భర్త ఢాకాలో ఉన్నాడట. పుట్టినింటికివెళ్తూ, దారిలో నన్ను చూడవచ్చింది"—అని రాయి పగుల కొట్టినట్లు చెప్పాను. పాపము-అతనిముఖం కాంతి విహీనమైనది.

రాత్రి మా ఇంట్లో ఉండమని నాన్నకూడ అడిగారు. జ్యోతి-"వీలులేదు నాన్నగారూ-మరియొక పర్యాయమువచ్చి నప్పుడు తప్పక ఆగుతాను"—అని చెప్పింది. నాన్న మరి బలవంత పెట్టలేదు. 'మరియొక పర్యాయం'-అన్న మాటల లోని నిఘూడ రహస్యాన్ని నేను మాత్రమే అర్ధము చేసుకున్నాను.

"రామనాధ్, ఆమె వెళ్లినతరువాత నీవుభోంచేయి"-అనిచెప్తూ గదివిడచి వెళ్లారు. మానాన్న ఎప్పుడూమితభాషి.

"ముఖ్యమైన ఒకసంగతి నీకు చెప్పమరిచాను. జ్యోతీ-మనదామోదరం—కమ్యూనిష్టు—ఈ రోజు అతనికి ఖైదు విధించారు. నేను ప్రభుత్వం చర్యను సమర్ధించాను."

"ఘనకార్యము చేశారను కున్నారా?-సిగ్గుతో క్రుంగిపోవలసినదానికి మీరు-మీ కుత్సితబుద్ధిని ప్రశంసిస్తున్నారే-" అని గుమ్మములో నిల్చొని జ్యోతి అడిగింది.

"నా తప్పుకాదు......" వాక్యం పూర్తికాక ముందే జ్యోతి-"ఇక చాలించండి మీ సమర్ధనలను. స్నేహితునికే ద్రోహంచేశారు."

ఇక మాట్లాడితే తగవు తప్పదని తలవంచుకున్నాను.

"ఇకసెలవు—నమస్తే"-అన్నది, గుమ్మందాటి డాబా ప్రవేశించిన జ్యోతి. జ్యోతిర్మయి ఆ రాత్రి అగుపించినంత అందంగా ఎప్పుడు కనుపించలేదు.

ఆమెను హృదయానచేర్చి, నాబాహువులలో బంధించాలనిపించింది. మరుక్షణం-నాకూ—'నా' జ్యోతికి మధ్యనున్న అగాధం స్ఫురణకొచ్చింది. ముందుకు చాచిన నా బాహువులు, ఆమె నమస్కరించడానికి ఎత్తిన హస్తాలను మాత్రమే తాకగలిగినాయి. నా కందులోనే ఏండ్లు పూండ్లు తపించినా ప్రాప్తించని సుఖం లభించింది. నిర్మల ప్రేమలో పరవశత్వము పొందేసమయం ఒక క్షణమైనా అమూల్యము, అమోఘము.

"నా జీవితములో మిమ్మల్నితప్ప ఎవరిని మాడ నభిలషింపలేదంటూ"-మరుక్షణం-మేడమెట్లు దిగి, హాలువరండా దాటి జ్యోతి వీధిని ప్రవేశించింది.

జ్యోతిర్మయి, దూరపు అంధకారంలో మిళితమై పోవడమును నేను, నిర్జీవ ప్రతిమవలె డాబాగోడ నానుకొని నిరాశతో తిలకించాను.

కాలచక్రంలో పది గ్రీష్మఋతువులు తిరిగాయి. జ్యోతిర్మయి జాడ నేటికిని నే నెరుగను.